# మిర్చి రైతుల ఆందోళన

- మారిన వాతావరణ పరిస్థితులు
- పంటను కల్లాల్లో నిల్వ చేయలేక అవస్థలు
- రోజురోజుకూ తగ్గుతున్న ధరలు



కల్లంలో ఆరబోసిన మిర్చి

**వెంకటాపురం(కె):** మారిన వాతావరణ పరిస్థితులతో రైతులు ఆందోళన పడుతున్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికి అందిన సమయంలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారడంతో పంటను కల్లాల్లో ఉంచాలో లేక అమ్ముకోవా లో అర్థంకాక తికమక పడుతుతున్నారు. మండలంలో ఈ సంవత్సరం రైతులు సుమారు ఆరు వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. మిర్చి పంట సాగు చేసే సమయంలో మిర్చి ధర క్వింటాకు రూ.23 వేల వరకు పలికింది. ప్రస్తుతం నాణ్యమైన మిర్చి ధర రూ.12 వేలు ఉండగా నాణ్యత లేని మిర్చి ధర రూ.10 వేల వరకు పలుకుతుంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మారిన వాతావరణ పరిస్థితులు**

ఒక్కసారిగా వాతావరణ పరిస్థితులు మారటంలో రైతులు పండిన పంటను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కూలీల కోరతను అధిగమించి కోతలు కోసి కల్లాల్లో మిర్చిని రైతులు ఆరబెట్టుకున్నారు. ఒక్కసారిగా వాతావరణం మారి మూడు రోజులుగా గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో పంట తడవకుండా రక్షించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ లో ధర లేక పోవటంతో రైతులు తమ పంటను కల్లాల్లోనే తక్కు వ ధరకు దళారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు కోల్డ్ స్టోరేజీల్లో పెట్టేందుకు వరంగల్, ఖమ్మం గుంటూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. పంటను అమ్మలేక దాచిపెట్టలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు మిర్చికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

### కల్లంలోనే అమ్ముకున్నా..



నాలుగు ఎకరాల మిర్చి పంట సాగు చేశా. తెగుళ్లతో పంట దిగుబడి తగ్గిపోయింది. దీనికి తోడు వతావరణం మారి వర్షాలు పడుతుండటంతో పంటను కల్లాలో ఉంచలేక, కోల్డు స్టోరేజీల్లో పెట్టలేక కల్లంలోనే పంటను అమ్ముకున్నా. ప్రస్తుతం ధర 12 వేలకు పడిపోవడంతో తక్కువ రేటుకు అమ్ముకోవడంతో పెట్టుబడులు కూడా రాలేదు.

\- నాగరాజు, రైతు

### కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా..



ప్రస్తుతం ఉన్న రేటుకు మిర్చి అమ్మితే పెట్టిన పెట్టుబడులు రాక నష్టం వచ్చే అవకాశం ఉంది. కొద్ది రోజుల తర్వాత ఎగుమతులు పెరిగితే ధర పెరిగే అవకాశం ఉండటంతో ఆరు ఎకరాల మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా.

\- విజయ్, రైతు

## క్లుప్తంగా

### అభివృద్ధికి సహకరించండి



**వాజేడు:** మారుమూల ఏజెన్సీలో వెనుకబడిన వాజేడు మండలాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ బలరాం నాయక్‌లకు వినతి పత్రాన్ని అందజేశారు. పినపాక నియోజక వర్గానికి వచ్చిన ఆయన వద్దకు వెళ్లి మండల సమస్యలను వివరించారు. పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్, సాయి కల్యాణ్, జగన్నాథరాజు, ఆదినారాయణ, పోలూరు వేణు, మోహన్ రావు, ఎల్లయ్య, నాన బాబు తదితరులు ఉన్నారు.

### రజతోత్సవ సభకు తరలిరావాలి



**చిట్యాల:** వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని జూకల్, చల్లగరిగ, ముచినిపర్తి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు ప్రతీ ఇంటి నుంచి గులాబీ జెండాతో తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, నాయకులు తొటం నవీన్, పేరుమాండ్ల రవీందర్ గౌడ్, జంబుల తిరుపతి పాల్గొన్నారు.

### గుండెపోటుతో అర్చకుడి మృతి

**కాటారం:** మహాముత్తారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అర్చకుడు కాగిత లింగమూర్తి(55) శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. లింగమూర్తిపై పలువురు సంతాపం తెలిపారు.

### చికిత్స పొందుతున్న యువకుడి మృతి

**కాటారం:** మద్యం మత్తులో క్షణికావేశంలో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోతులవాయి గ్రామానికి చెందిన చల్ల దేవేందర్(26) ఆటో నడుపుతుంటాడు. ఆటో నడపగా వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ జల్సాలకు అలవాటుపడ్డాడు. కుటుంబ పోషణ భారం కావడంతో తల్లి సమ్మక్క ఇంట్లోకి డబ్బులు ఇవ్వకుంటే ఎలా గడిచేది అని దే వేందర్‌ను మందలించింది. కుటుంబ పరిస్థితులు మనసులో పెట్టుకొని మద్యం తాగి దేవేందర్ క్షణికావేశానికి గురై ఈ నెల 5న ఇంటి సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి సమ్మక్క, చుట్టూ పక్కల వారి సహాయంతో చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అ క్కడి నుంచి ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. దేవేందర్ చికిత్స పొందుతూ శుక్రవా రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతు డి తల్లి సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

# పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న నాయకులు

**ములుగు రూరల్:** పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూప అన్నారు. శుక్రవారం మల్లంపల్లి, శ్రీనగర్ గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ బియ్యం అందిస్తుందని అన్నారు. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు, ప్రధానమంత్రి సడక్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, కిసాన్ సమ్మాన్ పథకాలను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైకాని మహేందర్, సారన్న, దండిగ వెంకన్న, కత్తి హరీశ్, రవిగౌడ్, నరేష్, రమ, కార్తీక్, వంశీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**ములుగు రూరల్:** అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో రైతు సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం సంఘం జెండాను రైతు సంఘం నాయకుడు రాములు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో వర్లి ఆదివాసీ తిరుగుబాటు ఏఐకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారని అన్నారు. రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతాంగాన్ని ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని అన్నారు. ప్రవీణ్, వరలక్ష్మీ, మర్రి గట్టయ్య, ప్రభాకర్, సారంగం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘సమస్యలు పరిష్కరించడంలో విఫలం’

**వెంకటాపురం(కె):** విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాటాడుతూ.. జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న లెచ్చరర్ పోస్టులు, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఖమ్మంలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అరంతరం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితేజ, చరన్, వరుణ్ తేజా, నిఖిల్, రాజు తదితరులు ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఏపీఎం అప్పారావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం అప్పారావు

**మంగపేట:** ప్రభుత్వం స్థానికంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్ద ధర లభిస్తుందని ఐకేపీ ఏపీఎం అప్పారావు అన్నారు. మండలంలోని అకినపల్లిమల్లారం, రామచంద్రునిపేటలో సెర్ప్(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కేంద్రాల నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. సీసీ సత్యనారాయణ, సులోచన, జనార్దన్, రైతులు పాల్గొన్నారు

# సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి నిధులు మంజూరి చేయడతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిటమట రఘు మాట్లాడుతూ.. ఆస్పత్రి అభివృద్ధికి రూ.22 కోట్ల నిధులు మంజూరు చేయటం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరామ్, అఫ్సర్ పాషా, సయ్యద్ హుస్సేన్, గుమ్మడి సోమయ్య, కరంచందు, సురేందర్, ఖీల్‌ఖాన్, లాలయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎంఈఓ లక్ష్మణ్‌బాబు



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**మల్హర్:** ప్రభుత్వ పాఠశాల0ల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ లక్ష్మణ్‌బాబు అన్నారు. ప్రైవేట్ బడులు వద్దు-ప్రభుత్వ బడులు ముద్దు అనే నినాదంతో మండలంలోని స్థానిక తాడిచర్ల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌బాబు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో ఆంగ్ల బోధన, డిజిటల్ తరగతులు, విశాలమైన ఆటస్థలం, మంచినీటి సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ ఉన్నారు.

# మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్



ములుగు రూరల్: పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**ములుగు రూరల్:** మనువాద గులాంగిరిపై పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మక్క, గుండబోయిన రవిగౌడ్, రవిందర్, రాజు, మహేష్, అజంత, రజిత, కృష్ణవేణి, నాగమణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

**పూలే ఆశయ సాధనకు ఉద్యమించాలి**

**వాజేడు:** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం బహుజనులంతా ఐక్యంగా ఉద్యమించాలని బీఎస్పీ భద్రాచలం అధ్యక్షుడు తడికెల శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో కారం చిరంజీవి అధ్యక్షతన శుక్రవారం జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అణిచి వేయడిన బహుజన కులాలకు, మహిళలకు విద్యను అందించడం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు.



ఏటూరునాగారం: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



వాజేడు: మాట్లాడుతున్న శివకుమార్

ఈ కార్యక్రమంలో కుమ్మరి రాంబాబు, జనగం కేశ్వరావు, దేవ సహాయం, రమ్య, మోహన్ రావు, స్వరబాబు, సుజాత, ప్రేమ కుమారి, యేసు ఉన్నారు.

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, ఆయూబ్ వేవేందర్, పాషా, సైయ్యద్ హుస్సేన్, గుమ్మడి సోమయ్య, వసంత శ్రీనివాస్, పూజారి సురేందర్, గుడ్ల దేవేందర్, లాలయ్య, ఎల్లయ్య, రాధిక, భాగ్య, గంప శివ తదతరులు ఉన్నారు.

## సన్న బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సన్నబియ్యం లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తా అని ఇచ్చిన మాటప్రకారం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు, నాయకులు శకీల్, నిట్టూరి నగేష్, అమృతం సారయ్య, తాజొద్దీన్, మాచెర్ల అరుణ్, లేతకరి రవి, సురేష్, రాజబాపుగౌడ్ పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

**టేకుమట్ల:** మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన కాటం తిరుపతి తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శుక్రవారం తిరుపతి పదో తరగతి బాల్యమిత్రులు పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాజు, రాజయ్య, తిరుపతి, తిరుమలేష్, రఘు, సంపత్, మహేందర్, రాములు, బాలు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



భూపాలపల్లి రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరీ

**కాటారం:** గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటే తల్లి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీణ, శివరాణి అన్నారు. కాటారం మండలం అల్లీపూర్, అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరా భ్యాసం చేశారు.

**భూపాలపల్లి రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని, బాలింతలు, గర్భిణులు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. పోషణ మాసం, పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందిగామ అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సమత ఆధ్వర్యంలో పోషణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రాజేశ్వరీ హాజరై పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఏఎన్ఎం మహేశ్వరీ, ఆశ వర్కర్ అనిత ఉన్నారు.

# కోటంచలో రోడ్డు విస్తరణపై అభ్యంతరం

**రేగొండ:** మండలంలోని కొడవటంచ గ్రామంలో రోడ్డు విస్తరణకు స్థానికులు అభ్యంతరం తెలిపారు. కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారు. కాగా అభివృద్ధిలో భాగంగా గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. దీంతో విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులు గ్రామ సభలో 40 ఫీట్లకు అంగీకారం తెలిపి, తీర్మానం చేశారు. కాని అధికారులు శుక్రవారం 60 ఫీట్‌లకు మార్కింగ్ చేయడంతో బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో చేసిన తీర్మానం ప్రకారం 40 ఫీట్లకు మాత్రమే రోడ్డు విస్తరించాలని బాధితులు కోరుతున్నారు. లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని బాధితులు ఆవేదనను వ్యక్తం చేశారు.

# రహదారి గుంతలమయం



తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద రోడ్డుపై ఉన్న గుంతలు



మల్లారం ఆరెవాగు వంతెన సమీపంలోని గుంతలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

**మల్హర్:** మండలంలోని తాడిచర్ల నుంచి కొయ్యూరు నాగులమ్మ వరకు ఉన్న డబుల్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం తాడిచర్ల నుంచి కొయ్యూరుకు ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో రాకపోకలు సాగుతుంటాయి. ఈ గుంతలమయమైన రోడ్డులో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలుస్తుంది. దీంతో ఎక్కడ గుంత ఉందో.. ఏ పక్కన గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**మట్టితోనే సరి..**

రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా మట్టిని నింపుతున్నారు. దీంతో భారీ వాహనాల రాకపోకలు సాగుతుండటంతో గుంతల్లో నింపిన మట్టి కారణంగా దుమ్ము, ధూళి ఏర్పడి ఇళ్లలోకి చేరుతుంది. దీంతో అనార్యోలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గుంతల్లో పోసిన మట్టి కూడా రెండు, మూడు రోజుల కంటే ఎక్కువగా ఉండకపోవడంతో పాటు గుంతలు రోజు రోజుకూ మరింత పెరుగుతున్నాయని తెలుపుతున్నారు. ఇదిలా ఉండగా ఇటువంటి మార్గాల్లో వెళ్లడం ద్వారా స్పాండలైటీస్ సమస్యతో పాటు కీళ్ల, మోకాళ్ల నొప్పులు వచ్చే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొయ్యూరు నాగులమ్మ నుంచి తాడిచర్ల వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.35కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలుపుతున్నారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజు

**కాటారం:** కాటారం మండలం దామెరకుంట సమీపంలోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ ఏకలవ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజయ్య శుక్రవారం తహసీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ప్రతీ రోజు వాగులో జేసీబీలతో ఇసుక తోడి లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపట్టడం ద్వారా నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని తహసీల్దార్‌కు విన్నవించారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని రాజు కోరారు.